ఆర్టీసీ ఉద్యోగులకు అవార్డుల ప్రదానం



బండ్లగూడ డిపోలో అవార్డులను అందజేస్తున్న ఆర్ఎం

నాగోలు: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులకు ఉద్యోగులు మెరుగైన సేవలు అందిస్తుండటం అభినందనీయమని ఆర్టీసీ హయత్‌నగర్ డివిజన్ డిప్యూటీ ఆర్ఎం సుచరిత అన్నారు. బండ్లగూడ ఆర్టీసీ డిపోలో మే నెలకు సంబంధించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు మంగళవారం ప్రగతి చక్రం అవార్డులను అందజేశారు. బస్సుల్లో అత్యధిక ఓఆర్ సాధించి సంస్థను లాభాల బాటలోకి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ రమేష్, సీఐ శాలిని, ఎంఎఫ్ బాలయోగీశ్వరి పాల్గొన్నారు.

దీక్షకు తరలిన విశ్వకర్మలు

చైతన్యపురి: పోలీసుల వేధింపులకు నిరసనగా కొండోజు నరసింహాచారి ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరాపార్కు వద్ద నిర్వహించిన ఆమరణ దీక్షలో పాల్గొనేందుకు మలక్‌పేట, ఎల్బీనగర్ నియోజకవర్గాల స్వర్ణకారం సంఘం నాయకులు భారీగా తరలివెళ్లారు. చోరీ కేసుల్లో పోలీసులు అక్రమంగా కేసులు బనాయించి స్వర్ణకార వృత్తిదారులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని సంఘం మాజీ అధ్యక్షుడు కీర్తిగారి అనంతాచారి ఆవేదన వ్యక్తం చేశారు. కేసులకు బయపడి సున్నిత మనస్కులు ఆత్మహత్య చేసుకుంటున్నారని, అకారణంగా స్వర్ణకార వృత్తిదారులను వేధించకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. దీక్షకు తరలివెళ్లిన వారిలో సంఘం అధ్యక్షుడు రవిచారి, గోవర్ధన్, వెంకటరమణ, శ్రీనివాసచారి, మనోజ్ ఉన్నారు.

ఎక్కడి వర్షం నీరు అక్కడే..!

- నీరు నిల్వడంతో ఈగలు, దోమల వృద్ధి
- అంటురోగాల బారిన పడతామని జనం ఆందోళన

తొలగింపు చర్యలపై అధికారుల నిర్లక్ష్యం

ఎల్బీనగర్: వర్ష కాలం వచ్చినా అధికారుల్లో చలనం రాక పోవడంతో ఎక్కడికక్కడ పేరుకు పోతున్న వర్షం నీటి నిల్వలు..అంటు రోగాల వ్యాప్తి భయంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం సిబ్బంది పట్టించుకోకపోవడంతో వర్షం కురిసినప్పుడు ఎక్కడ నీరు అక్కడే నిలుస్తోంది. వర్షా కాలంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినా స్థానిక అధికారుల్లో మాత్రం చలనం రావడం లేదు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోగాల వ్యాప్తికి అవకాశం..

లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు రోజుల తరబడి నిల్వ ఉండటంతో రోగాలు వ్యాప్తి చెందే అవకాశం ఉంటుందని నిపుణులంటున్నారు. నీరు నిల్వ ఉండటం కారణంగా దోమలు, ఈగలు వ్యాప్తి చెంది మలేరియా, డెంగీ, డయేరియా వంటి రోగాల బారిన పడే అవకాశం చాలా ఎక్కువగా ఉందంటున్నారు. వానా కాలంలో సాధారణంగానే అధిక శాతం ప్రజలకు రోగాలు సోకుతాయని వైద్య నిపుణులు అంటున్నారు.

నీరు నిల్వ ఉండే ప్రాంతాలు అధికమే..

నియోజకవర్గంలో ప్రతి డివిజన్‌లో 5 నుంచి 20 కాలనీల్లో నీరు నిల్వ ఉంటుంది. ఇవే కాకుండా నిత్యం పొంగే డ్రైనేజీలతో ప్రజలు నరకయాతన పడుతున్నారు.



సాహెబ్‌నగర్ పాపిరెడ్డి కాలనీలో కుంటలా మారిన రోడ్డు

పత్తాలేని ఎంటామాలజీ, మాన్‌సూన్ బృందాలు..

నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో దోమల లార్వా వృద్ధి చెందకుండా ఉండేందుకు రసాయన మందులను ఎప్పటికప్పుడు పిచికారీ చేయాల్సిన అధికారులు, సిబ్బంది పత్తాలేరని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే కాలనీల్లో పలు దఫాలుగా దోమల మందును పిచికారీ చేయాల్సి ఉండగా కొన్ని ప్రాంతాల్లో మాత్రమే చేసి చేతులు దులుపుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వర్షా కాలన్ని దృష్టిలో పెట్టుకొని నీటి నిల్వ ప్రాంతాల్లో, చెరువులు, కుంటల్లో ఎంటామాలజీ, మాన్‌సూన్ బృందాలు యుద్ధప్రాతిపాదికన మందులను పిచికారీ చేయాలని కోరుతున్నారు.

ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం..

సరైన ప్రాణాళికలతో రోడ్ల అభివృద్ధి చేయకపోవడంతో కాలనీల్లో పలు రోడ్లపై నిత్యం నీరు నిలుస్తోంది. ఇంజినీరింగ్ అధికారులు నిర్లక్ష్యం కారణంగానే నీటి నిల్వ ఉండే ప్రాంతాలు అధికమవుతున్నాయని, రోడ్లు వేసే సమయంలో అధికారులు పట్టించుకోక పోవడంతో కాంట్రాక్టర్లు తమ ఇష్టానుసారంగా రోడ్లను వేసి వెళ్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలు చోట్ల డ్రైనేజీ, వాటర్ పైప్‌లైన్ ఇతర అభివృద్ధి పనుల కోసం రోడ్లను తవ్వి అలాగే నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



హరిహరపురం కాలనీలో రోడ్లపై నీరు

నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలి..

లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలి. ఎప్పటికప్పుడు దోమల నివారణ మందు పిచికారీ చేయాలి. చిన్న చిన్న పనులు చేపట్టి చాలా చోట్ల నీరు నిల్వ కుండా చర్యలు తీసుకోవచ్చు. ఆ దిశగా అధికారులు చర్యలు తసుకోవడంలో విఫలమవుతున్నారు.
– విజయ్‌కుమార్, పాపిరెడ్డి కాలనీ

చర్యలు తీసుకుంటున్నాం..

హయత్‌నగర్ సర్కిల్ పరిధిలోని పలు లోతట్టు ప్రాంతాలను గుర్తించాం. ఇప్పటికే పలు డివిజన్లలో ఉన్న నీటి నిల్వ ప్రాంతాల్లో నీరు నిల్వకుండా చర్యలు తీసుకున్నాం. అన్ని ప్రాంతాల్లో అధ్యయనం చేసి పూర్తి స్థాయిలో నీటి నిల్వ ప్రాంతాలు లేకుండా చర్యలు చేపడతాం.
– ఈఈ రమేష్ బాబు

విద్యార్థులకు పౌరాణిక నాటక పద్యాల పోటీలు

నాగోలు: బాలబాలికలు, యువతీ యువకుల్లో పౌరాణిక నాటక రంగ పద్యాల పట్ల ఆసక్తి పెంచడంతో పాటు వారిలోని ప్రతిభను ప్రోత్సహించేందుకు చిమ్మపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించనున్నారు. జూలై చివరి వారంలో న్యూనాగోలులో ఈ పోటీలు జరుగుతాయని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు చిమ్మపూడి శ్రీరామమూర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. భావ, రాగ యుక్తంగా ఏవైనా 2 పద్యాలు(సోలో) అభ్యర్థులు పాడాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రంలో 8,9,10 తరగతుల విద్యార్థులకు జూనియర్స్‌గా, ఇంటర్, ఆపై చదువులు చదువుతున్న విద్యార్థులకు సీనియర్స్‌గా పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు నగదు బహుమతి అందజేస్తామని, జూలై 2 వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఫోన్ నం. 9704177270లో సంప్రదించవచ్చు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో)... టమాటా 55, వంకాయ 28, బెండ 55, పచ్చిమిర్చి 85, కాకర 65, బీర 72, క్యాబేజీ 23, ఫ్రెంచిబీన్స్ 155, క్యారెట్ 40, దొండ 43–45, చిక్కుడు 70, గోకర 55, బీట్‌రూట్ 23, క్యాప్సికం 75, ఆలు 35, దోస 23, సొర 17, పొట్ల 23, ఉల్లిగడ్డ 39, చామగడ్డ 37.బుధవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

డ్రైనేజీ మ్యాన్‌హోళ్లలో పూడికతీత



డ్రైనేజీలో పూడిక తీస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

లింగోజిగూడ: సరూర్‌నగర్, కర్మన్‌ఘాట్ ప్రధాన రహదారిపై గత వారం రోజులుగా డ్రైనేజీ పొంగిపొర్లుతున్న సమస్యపై 'ఏరులై పారుతున్న మురుగు' శీర్షికన సాక్షిలో మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల, పైపుల్లో పేరుక పోయిన పూడికను తీయించి సమస్యను తాత్కాలికంగా పరిష్కరించారు. లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, జల మండలి డీజీఎం సరిత, మేనేజర్ పవిత్ర లక్ష్మిలు డ్రైనేజీ మరమ్మతులను పరిశీలించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీలో పూడిక పేరుక పోవడంతో సమస్య వస్తున్నదని, ప్రస్తుతం పూడికతీత పనులు చేపట్టి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కే పురం డివిజన్ సౌభాగ్యపురం కాలనీలోని శ్రీ వెంకటేశ్వరా స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం వెంకటేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆర్‌కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూదర్ రావు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు వారిని శాలువాతో సత్కరించి స్వామివారి ఫొటో, ప్రసాదం అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి



నాగోలు: గుర్తు తెలియని మహిళ మృతి చెందిన ఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. ఎల్బీనగర్ పోలీసుల కథనం ప్రకారం... మన్సూరాబాద్ చౌరస్తాలోని బెల్లం టీ షాప్ వద్దకు మంగళవారం రాత్రి గుర్తు తెలియని మహిళ (40) వచ్చింది. అక్కడి టీ షాప్ యజమాని నీరు ఇవ్వాలని కోరగా, అతను ఇచ్చే లోగా కింద పడి మృతి చెందింది. వెంటనే స్థానికులు 100 డయల్‌కు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లభించ లేదు. పోలీసులు పరిసర ప్రాంతాల్లో విచారణ చేసినా మృతురాలి వివరాలు తెలియరాలేదు.దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

కల్లు విక్రయాల్లో నిబంధనలకు తూట్లు

మండల ప్రజాపరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు శేఖర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: నిబంధనలు పాటించని గీత కార్మికులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఇబ్రహీంపట్నం మండల ప్రజాపరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు కొమ్మిడి శేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని పోల్కంపల్లిలో గీత కార్మికులు ఇష్టారాజ్యంగా కల్లు విక్రయాలు జరుపుతున్నారని వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం రైతులతో కలిసి ఇబ్రహీంపట్నం ఎక్సైజ్ అధికారులకు ఆయన ఫిర్యాదు చేశారు. గీత కార్మికులు సొసైటీ నిబంధనలు ఉల్లంఘించి కల్లు విక్రయాలు జరుపుతున్నారని మండిపడ్డారు. తాటిచెట్ల నుంచి సేకరించిన కల్లును వేరువేరుగా విక్రయించకుండా ఒకే దగ్గర విక్రయించాలని కోరా రు. గ్రామంలో నిరుపయోగంగా ఉన్న తాటిచెట్లను తొలగించాలని కోరారు. మాజీ సర్పంచ్ యాదయ్య, గ్రామస్తులు వెంకటేశ్, యాదయ్య, బుచ్చిరెడ్డి, శేఖర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

అబ్దుల్లాపూర్‌మెట్: బాటసింగారం రైతు సేవా సహకార సంఘం సభ్యుడు, కుత్బుల్లాపూర్‌కి చెందిన అల్వాల్ పెంటయ్య 2019 ఏడాలిఓ మృతిచెందాడు. సహకార సంఘం తరపున అందించే రూ.15వేల ఆర్థిక సహాయాన్ని మంగళవారం సంఘం చైర్మన్ చేగూరి భరత్‌కుమార్.. మృతుడి భార్య రేణుకకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రాములు, అకౌంటెంట్ రాకేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నీట్ పరీక్షను రద్దుచేయాలి

ఇబ్రహీంపట్నం రూరల్: నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొవాలని బీఆర్ఎస్‌వీ నాయకులు, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఏనుగు భరత్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కష్టపడి చదివి డాక్టర్ కావాలని కలలు గన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆశలపై నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారం నీళ్లు చల్లిందన్నారు. ఫలితాలను మొదట ఈనెల 14న విడుదల చేస్తామని ప్రకటించి ముందస్తుగా 4వ తేదీన ఎన్నికల ఫలితాల రోజే విడుదల చేయడంపై సందేహాలు తలెత్తుతున్నాయని తెలిపారు. వెంటనే నీట్ పరీక్షను రద్దు చేసి దేశవ్యాప్తంగా ఒకేసారి కాకుండా రాష్ట్రాల వారీగా మరోసారి నిర్వహించాలని డిమాండ్ చేశారు.

వాన నీటిని ఒడిసి పట్టే సరికొత్త ప్రాజెక్ట్ ప్రారంభం



సహారాస్టేట్స్ కాలనీలో ఇంకుడు గుంతల్లో పేరుకున్న మట్టిని తొలగిస్తున్న కాలనీవాసులు

మన్సూరాబాద్: వాక్ ఫర్ వాటర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో వర్షపు నీటిని ఒడిసి పట్టే సరికొత్త ప్రాజెక్టును మన్సూరాబాద్ డివిజన్ సహారాస్టేట్స్ కాలనీలో మంగళవారం ప్రారంభించారు. కాలనీలో చెత్తాచెదారంతో నిండిపోయిన 12 ఇంకుడు గుంతలు, 2 ఓపెన్ వెల్స్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. ముఖ్యఅతిథిగా హాజరైన కాలనీ మెయింటెనెన్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సయ్యద్ జానీ మాట్లాడుతూ, ప్రతీ వర్షం బొట్టును ఇంకుడు గుంతలు, ఓపెన్ వెల్స్‌లోకి మళ్లిస్తే భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయన్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నీటి కోసం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. కాలనీవాసుల సహకారంతో వాన నీటిని సంరక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వాక్ ఫర్ వాటర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ, నీటి సంరక్షణకు కాలనీవాసులు ముందుకు రావటం అభినందనీయమని, ఇలాంటి ప్రాజెక్టులు పట్టణ ప్రాంతాల్లో నీటి ఎద్దడిని తగ్గిస్తాయన్నారు. సుమారు 42 ఎకరాల్లో విస్తరించి ఉన్న సహారా స్టేట్స్ కాలనీలో 1500 మిలియన్ లీటర్ల వర్షపు నీటిని సంరక్షించే ప్రాజెక్టును ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు శ్రీనివాసరావు, మేకల ప్రభాకర్‌రెడ్డి, నర్సింహగౌడ్, గంగదాసు కృష్ణారెడ్డి, కేఎస్ నర్సింహచారి పాల్గొన్నారు.

రేపు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి రాక

కాచిగూడ: కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా ఈ నెల 20న హైదరాబాద్ నగరానికి వస్తున్న సందర్భంగా ఆయనకు ఘనంగా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు తెలిపారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం ఈ నెల 19న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నగరానికి రావాల్సి ఉన్నా అనివార్య కారణాలతో వాయిదా పడిందని తెలిపారు. 20న సాయంత్రం 4 గంటలకు ఆయనకు ఘన స్వాగతం పలకడానికి పార్టీ కార్యకర్తలు, నేతలు తరలిరావాలని కోరారు.

మోదీతోనే దేశాభివృద్ధి

కాచిగూడ: ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోపిశెట్టి ప్రమోద్ అన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బండి సంజయ్ కుమార్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ప్రమోద్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు, కార్యకర్తలు ఆయనను కలిసి సత్కరించారు. మంగళవారం బర్కత్‌పురలోని పార్టీ కార్యాలయంలో ప్రమోద్ మాట్లాడుతూ.. నరేంద్రమోదీ ఆధ్వర్యంలోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. ఈ నెల 19న నగరానికి వస్తున్న మంత్రి బండి సంజయ్‌కు ఘనస్వాగతం పలకడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రమాదకర మ్యాన్‌హోళ్లపై రంగులతో అవగాహన



డ్రైనేజీ మ్యాన్‌హోల్ పైకప్పులపై ఎరుపు రంగు వేస్తున్న జలమండలి డీజీఎం షీలారాణి

చాదర్‌ఘాట్: వానా కాలంలో వరదలు ముంచెత్తినప్పుడు లోతైన మ్యాన్‌హోళ్ల మూతలు తెరిచి ఉంటే ఏర్పడే అనర్థాలపై పాదచారులకు అవగాహన కల్పిస్తున్నామనని మలక్‌పేట జలమండలి డీజీఎం షీలారాణి తెలిపారు. మంగళవారం డివిజన్‌లో మ్యాన్‌హోళ్ల ఏర్పాటు పనులను ఆమె పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, మ్యాన్‌హోళ్ల మూతలపై ఎరుపు రంగు వేస్తున్నామని తెలిపారు. అక్బర్‌బాగ్, మూసారాంబాగ్, ఓల్డ్‌మలక్‌పేట ప్రాంతాల్లోని లోతైన మ్యాన్‌హోళ్లను గుర్తించి మూతల కింద సేఫ్టీ గ్రిల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. మూతలపై ప్రమాదకర హెచ్చరికతో కూడిన రెడ్‌మార్క్‌ను వేస్తూ జనాన్ని అప్రమత్తం చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు వంద శాతం మ్యాన్‌హోళ్ల మూతలపై రెడ్‌మార్కులు వేశామన్నారు. వరదలు వచ్చినప్పుడు రెడ్‌మార్క్ ఉన్న మ్యాన్‌హోళ్ల పక్క నుంచి జాగ్రత్తగా వెళ్లాలని ప్రజలకు సూచించారు.

అస్తవ్యస్తంగా పారిశుద్ధ్య పనుల నిర్వహణ



హస్తినాపురం పద్మావతి కాలనీలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తకుప్ప

కాలనీల్లో రోడ్ల వెంబడి పేరుకుపోతున్న చెత్త కుప్పలు

వనస్థలిపురం: ఎల్బీనగర్ సర్కిల్ పరిధిలోని పలు కాలనీల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. పలు కాలనీల్లో అంతర్గత రోడ్ల వెంబడి చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. కాలనీల ప్రజలు పలువురు తమ ఇళ్లల్లోని చెత్తను, వేడుకుల సందర్భంగా తిన్న ప్లేట్లను, గ్లాసులను, మిగిలిన ఆహార పదార్థాలను, ఇతర వ్యర్థాలను బ్యాగుల్లో తెచ్చి ఓపెన్ ప్లాట్లలో పడేసి పోతున్నారు. దీంతో పలు కాలనీశళ్ల రోడ్ల వెంబడి అనధికార డంప్ బిన్లు ఏర్పడుతున్నాయి. కాగా చెత్తను రోడ్ల వెంబడి పారేయకుండా చూడటంలోనూ, అలా పోగైన చెత్తను సకాలంలో అక్కడినుంచి డంపింగ్ యార్డులకు తరలించడంలోనూ శానిటేషన్ అధికారులు, సిబ్బంది విఫలమవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోజులకొద్దీ చెత్త కాలనీల పరిసరాల్లో పేరుకు పోతుండటంతో అక్కడ కుక్కలు సంచరిస్తూ పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నాయని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా శానిటేషన్ అధికారులు రోడ్ల వెంబడి చెత్తను వేయకుండా చేయడంతో పాటు పోగైనా చెత్తను వెంటనే అక్కడి నుంచి తరలించేలా తగిన చర్యలు తీసుకోవాలని కాలనీల ప్రజలు కోరుతున్నారు.

హనుమాన్ ఆలయ హుండీ ఆదాయం రూ.32 లక్షలు



హుండీ లెక్కింపులో పాల్గొన్న ఆలయ పాలక మండలి సభ్యులు

చంపాపేట: డివిజన్ పరిధిలోని కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయ స్వామివారి ఆలయ హుండీని మంగళవారం లెక్కించారు. భక్తులు స్వామివారికి కానుకల రూపంలో 82 రోజులకు రూ. 32 లక్షల 89 వేల నగదు, 329 డాలర్లు సమర్పించారని ఆలయ ఈఓ శ్రీనివాస శర్మ తెలిపారు. కార్యక్రమంలో ఎండోమెంట్ జిల్లా సహాయక కమిషనర్ శేఖర్ పాలక మండలి చైర్మన్ నల్లా రఘుమారెడ్డి, సభ్యులు మధుసాగర్, ఆనంద్‌గౌడ్, సురేందర్‌రెడ్డి, శ్రీనివాస యాదవ్, తిరుమలేష్, అంజిరెడ్డి, యాదగిరి, భక్తులు పాల్గొన్నారు.

పార్కుల ఆధునికీకరణకు ప్రాధాన్యం



బీబ్లాక్ పార్కులో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

సైదాబాద్: డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లోని పార్కుల ఆధునికీకరణకు ప్రాధాన్యం ఇస్తున్నామని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కార్పొరేటర్ జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి డివిజన్ పరిధిలోని బీబ్లాక్ క్వార్టర్స్ కాలనీలోని పార్కును పరిశీలించారు. పార్కులోని వాకింగ్ ట్రాక్‌పై నూతనంగా ఏర్పాటు చేస్తున్న టైల్స్ ఏర్పాటు పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ వెంకన్న, కాలనీవాసులు పాల్గొన్నారు.

హస్తినాపురానికి నిధులు కేటాయించాలని వినతి



జెడ్సీకి వినతిపత్రం అందజేస్తున్న సుజాతానాయక్

హస్తినాపురం: డివిజన్‌లోని వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ కోరారు. ఈ మేరకు ఆమె మంళవారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ (జెడ్సీ) పంకజను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ సిటీ ప్లానర్ రాజేంద్రప్రసాద్, ఎస్ఈ అశోక్‌రెడ్డి, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం



అధికారులతో కలిసి కాలనీల్లో పర్యటిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్బీనగర్: కాలనీల్లోని సమస్యలు పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, సిబ్బంది, అధికారులు నిర్లక్ష్య ధోరణి విడనాడాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని శాతవాహన కాలనీ, విజయపురి కాలనీ ఫేజ్ 1లలో డ్రైనేజీ నూతన పైప్‌లైన్లు ఏర్పాటు చేసి రోడ్డు మరమ్మతులు చేపట్టకపోవడంతో కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు.స్పందించిన కార్పొరేటర్ మంగళవారం జీహెచ్ఎంసీ ఎస్ఈ అశోక్‌రెడ్డి, జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డి, డీజీఎం రాజగోపాల్, జీహెచ్ఎంసీ ఈఈ రమేష్‌బాబు, ఏఈ నరేందర్‌లతో కలిసి కాలనీల్లో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం లచ్చిరెడ్డి మాట్లాడుతూ, కాలనీల్లో చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాలనీల వాసులు లక్ష్మీనారాయణ, సాయిరాం, విష్ణువర్ధన్ రావు, సాంబశివరావు, నాయకులు పవన్, విజయ్ పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి



ట్రాఫిక్ అడిషనల్ డీసీపీకి వినతిపత్రం సమర్పిస్తున్న ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: కాలనీల్లో రోడ్లను ఆక్రమించి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి మంగళవారం రాచకొండ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. డివిజన్‌లోని కోదండరాంనగర్, వివేకానందనగర్ బస్‌స్టాప్, లలితానగర్, మధురాపురి కాలనీల్లో రహదారులను ఆక్రమించి వ్యాపారాలు చేయడం, అక్రమ పార్కింగ్‌ల కారణంగా ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. అలాగే దిల్‌సుఖ్‌నగర్ కోణార్క్ థియేటర్ వద్ద పీ అండ్ టీ కాలనీకి వెళ్లే రహదారిని ఆక్రమించడం వల్ల అంబులెన్స్ కూడా రాలేని పరిస్థితి ఉందని కార్పొరేటర్ తెలిపారు. ఇలా రోడ్లను కబ్జా చేసి వ్యాపారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకొని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరారు.

భూదాన్ భూములను కాపాడండి: సీపీఐ



సరూర్‌నగర్ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

నాగోలు: కర్మన్‌ఘాట్‌లోని సర్వే నెంబర్ 57లోని భూదాన్ భూమిని కబ్జాదారుల చెర నుంచి కాపాడాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) సరూర్‌నగర్ మండల కార్యదర్శి బాతరాజు నరసింహ, సహాయ కార్యదర్శి బోయిపల్లి రాములుగౌడ్, కందుల సుధాకర్ మంగళవారం సరూర్‌నగర్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నగరంలో భూముల రేట్లు ఆకాశాన్ని అంటడంతో కబ్జాదారులు ప్రభుత్వ భూములను, భూదాన్ భూములను కబ్జా చేస్తూ ఎదురు ప్రశ్నించిన వారిపై దాడులకు దిగుతూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి భూములు కబ్జాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

20న ఏఐసీఎఫ్ వార్షికోత్సవం

కాచిగూడ: ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) 28వ వార్షికోత్సవ వేడుకలను ఈ నెల 20న గోల్కొండ ఎక్స్‌రోడ్ లోని మెనోనైట్ బ్రదరన్ బేతేలు చర్చిలో నిర్వహిస్తున్నట్లు సంస్థ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ ఏకే గిడియోను బాబు తెలిపారు. వేడుకలకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల నుంచి క్రైస్తవ ప్రతినిధులు వార్షికోత్సవాలకు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

మహిళ మెడలోని గొలుసు స్నాచింగ్

మలక్‌పేట: భార్యాభర్తలు నడుచుకుంటూ వెళ్తుండగా ఓ అగంతకుడు బైక్ వచ్చి మహిళ మెడలోని బంగారు గొలుసును తెంచుకొని పరారయ్యాడు. మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం...మలక్‌పేట ముంతాజ్ కాలేజీ రోడ్ లైన్‌లోని మారుతీ అనసూయ అపార్టమెంట్‌మెంట్‌లో నివాసముంటున్న ఎల్. నర్సింహస్వామి, ఎల్. విజయమ్మ(60) భార్యాభర్తలు. ఇద్దరూ మంగళవారం రాత్రి 9.30 గంటలకు ఆనంద్‌నగర్‌లోని అనితా నర్సింగ్ హోమ్ నుంచి ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్నారు. భర్త ముందు వెళ్తుండగా విజయమ్మ వెనుక ఉంది. శర్మ ఆసుపత్రి సమీపంలో వెనుక నుంచి బైక్‌పై వచ్చిన ఓ అగంతకుడు ఆమె మెడలో ఉన్న 4 తులాలు బంగారు పుస్తెల తాడు తెంచుకుని పరాయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు సమీప ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.